ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బినోలా సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కుటుబ సమేతంగా శనివారం కలిశారు. ఆయన పుట్టిన రోజు కావడంతో ఎమ్మెల్సీ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు తిరుపతి లడ్డూను అందజేశారు. –నవీపేట, డిసెంబర్ 14

సైన్స్‌ఫేర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన ఘన్‌పూర్ విద్యార్థులు

డిచ్‌పల్లి, డిసెంబర్ 14: మండలంలోని ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సైన్స్‌ఫేర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం ఆనంద్ తెలిపారు. విద్యార్థులు నవనీత్, రాము ఇటీవల జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించిన ప్రయోగం అధికారుల ప్రశంసలు పొందినట్లు పేర్కొన్నారు. దీంతో వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులతోపాటు గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయురాలు ధనలక్ష్మిని శనివారం అభినందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

రుద్రూర్, డిసెంబర్ 14 : మండల కేంద్రంలోని హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 24 మంది వృద్ధులకు దుప్పట్లను శనివారం పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఐలకు పోస్టింగ్

వినాయక్‌నగర్, డిసెంబర్14: మల్టీజోన-1 పరిధిలో సీఐలకు పోస్టింగ్ కల్పిస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఐదుగురు సీఐలకు నిజామాబాద్ కమిషనరేట్‌లో ఆదిలాబాద్,రామగుండం ఆసిఫాబాద్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. మోదుగు రమేశ్‌కు నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ సీఐగా పోస్టింగ్ కల్పించారు. పాండేరావ్–ఆదిలాబాద్ డీసీఆర్‌బీ, ఏ.వెంకటేశ్వర్ రావు ఆదిలాబాద్ జిల్లా బోథ్, పి.కరుణాకర్–రామగుండం సీఎస్‌బీ, ఎన్.శ్రీధర్–ఆసిఫాబాద్‌కు బదిలీ చేశారు.

ప్రయాణికుల సెల్‌ఫోన్స్ రికవరీ

వినాయక్‌నగర్, డిసెంబర్ 14: రైళ్లల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న వారి సెల్‌ఫోన్లను ట్రేస్ చేసి శనివారం బాధితులకు అందజేసినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. టికెట్ ఉండి ట్రైన్‌లో ప్రయాణం చేస్తున్న వారు తమ సెల్‌ఫోన్ మిస్సయితే జీఆర్‌పీ నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- కోటగల్లి, ఎస్సీ బాలికల వసతి గృహాల్లో తనిఖీలు
- కామన్ డైట్ మెనూ ప్రారంభం

రుద్రూర్/ ఖలీల్‌వాడి, డిసెంబర్ 14 : విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. శనివారం ఆయన వర్ని మండలంలోని కోటయ్య క్యాంప్‌లో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో కామన్ డైట్ ప్లాన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను సందర్శించి కూరగాయలు, సరుకులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. సన్నబియ్యం, విజయ డెయిరీ పాల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. అంతకుముందు కలెక్టర్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీలో ఉన్న బీసీ, ఎస్సీ, బాలికల వసతిగృహాలను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ సహాయ అధికారి నర్సయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి భూమయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఏ.ఓ బి.సహదేవ్, సంక్షేమ వసతి గృహాల నిర్వాహకులు రాధారాణి, కల్పన తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

రైతుధర్నా విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి, డిసెంబర్ 14: జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించనున్న రైతుధర్నాను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో కరపత్రాలతో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఎన్నికల్లో ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలేదన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసహరించాలని, రైతు ఉద్యమసమయంలో రైతులపై నమోదుచేసిన కేసులను ఎత్తివేయాలని, ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని ఆమోదించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, దేవస్వామి, సుప్రియ, రాణి, శాంతక్క, లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య

మున్సిపల్ కార్మికులకు ఒకటిన వేతనాలు ఇవ్వాలి

ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్ డిమాండ్

కంఠేశ్వర్, డిసెంబర్ 14: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతినెలా వేతనాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్న మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఆలస్యంగా చెల్లించడం సిగ్గుచేటన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పుని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.వేతనాలు వారి ఖాతాల్లో వేయకుంటే కార్మికులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 14 : నూతన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని పెండింగ్ బిల్లులను చెల్లించాలని బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో బీసీటీయూ వివిధ మండలాల కార్యవర్గాలను ఏర్పాటు చేసి, సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్లు కంచరి రవికుమార్, కొట్టాల రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కైరంకొండ బాబు, రమణ స్వామి, రమేశ్, సతీశ్, శంకర్, గంగయ్య, సంజీవ్, ఇంద్రకరణ్ పాల్గొన్నారు.

లింగేశ్వర గుట్ట ఆశ్రమంలో మాజీ ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

సారంగాపూర్, డిసెంబర్ 14 : మండలంలోని మల్లారం గ్రామశివారులోని లింగేశ్వర గుట్ట ఆశ్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ శనివారం సందర్శించారు. శివాలయంలో ఆయన పూజలు చేశారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ వేద మంత్రోచ్చారణల మధ్య అర్చనలు , అభిషేకం నిర్వహించారు. అనంతరం వీజీగౌడ్‌ను కృష్ణ మహరాజ్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, నాయకులు బొల్లెంక గోపాల్‌రెడ్డి, అన్నం సాయిలు, అశోక్, బాలరాజు, అనూష, లక్ష్మణ్, గోపాల్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌ను సన్మానిస్తున్న పిట్ల కృష్ణమహరాజ్

వల్లభపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

కోటగిరి, డిసెంబర్ 14: మండలంలోని వల్లభపూర్ గ్రామ శివారులో ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేశారు. అందులో నుంచి ఆయిల్, రాగి తదితర పరికరాలను ఎత్తుకెళ్లారు. బాధిత రైతు శనివారం విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈవిషయమై కోటగిరి ఎస్సై సందీప్‌ను సంప్రదించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

న్యూసెన్స్ కేసులో యువకుడికి14 రోజుల జైలు

వినాయక్‌నగర్, డిసెంబర్ 14: జిల్లా కేంద్రంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ న్యూసెన్స్‌కు పాల్పడిన జంబిలం దిలీప్ అనే యువకుడికి 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్సై యాసిర్ అరాఫత్ శనివారం తెలిపారు. సదరు యువకుడు జులాయిగా తిరుగుతూ డబ్బుల కోసం కన్నతల్లిని వేధించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.దీంతో యువకుడిని స్టేషన్‌కు తీసుకురాగా..కత్తితో మెడ,ఛాతి పై తనకు తాను గాయాలు చేసుకొని న్యూసెన్స్ చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. శనివారం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా యువకుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారని పేర్కొన్నారు. యువకుడిపై గతంలో సైతం పలు కేసులు ఉన్నాయని తెలిపారు.

రామడుగు ప్రాజెక్టు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

ధర్పల్లి, డిసెంబర్ 14 : మండలంలోని రామడుగు ప్రాజెక్టు నీటిని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల పంటలకు ఎలాంటి ఢోకా లేదని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, నాయకులు చెలిమెల శ్రీనివాస్, రామడుగు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మద్దుల్ ఆలయ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

ధర్పల్లి, డిసెంబర్ 14 : మండల కేంద్రం శివారులోని మద్దుల్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి ఆలయ జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పూజా కార్యక్రమాలు, హోమం కొనసాగాయి. అనంతరం మొదటిసారిగా స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ జాతర ఉత్సవాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కోటగిరి, డిసెంబర్ 14: వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తహసీల్దార్ గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. వంటగది, సరుకులు నిల్వ చేసే గదిని భోజనశాల, మూత్రశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మైనార్టీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముబీన్, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, సలీం ఉన్నారు.

కంటి ఆపరేషన్ కోసం సాయం

పోతంగల్, డిసెంబర్ 14 : ఓల్డ్ పోతంగల్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన అనిఫా బేగం(50)కు కంటి చూపు తగ్గడంతో ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని సామాజిక సేవకర్త ఎంఏ.హకీమ్ తెలుసుకున్నారు. కంటి ఆపరేషన్ కోసం శనివారం ఆర్థిక సాయం అందజేశారు. రెండో కంటి ఆపరేషన్‌కు సహాయం చేస్తానని కుటుంబీకులు భరోసా ఇచ్చారు.

హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్స్ జిల్లా జట్టు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు సభ్యులతో నిర్వాహకులు

మాక్లూర్, డిసెంబర్ 14: హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్స్ బాలుర జిల్లా జట్టు ఎంపికలను కల్లడి ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఎంపికలను హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగామోహన్ చక్రూ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం 80మంది క్రీడాకారులు పాల్గొనగా.. వారిలో ప్రతిభ చూపిన 12 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 27నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న 2వ ఆలిండియా ఇంటర్ జిల్లా సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొంటారని హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, పీడీ సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కోశాధికారి రాజేశ్, సభ్యులు బాబూరావు, పీడీలు రమణ, మాధురి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మేకల సంత నిర్వహణ రద్దు

- నవీపేట బస్టాండ్ ఆవరణలో కాపలా కాసిన ఆర్టీసీ సిబ్బంది
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

నవీపేట బస్టాండ్‌లో మేకల సంత నిర్వహించకుండా కాపలా ఉన్న ఆర్టీసీ సిబ్బంది

నవీపేట, డిసెంబర్ 14: కొన్ని నెలలుగా నవీపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతి శనివారం నిర్వహిస్తున్న మేకల సంతకు ఆర్టీసీ అధికారులు బ్రేక్ వేశారు. 'బస్టాండ్‌లో మేకల సంత.. ప్రయాణికులకు ఇబ్బందులు' అనే శీర్షికతో గత ఆదివారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీనికి ఆర్టీసీ నిజామాబాద్ ఆర్ఎం టి.జ్యోత్స్న స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు నిజామాబాద్ రెండో డిపో మేనేజర్ సాయన్న 20మంది ఆర్టీసీ సిబ్బందితో శనివారం ఉదయం నవీపేట బస్టాండ్‌కు వచ్చారు. అక్కడ సంత నిర్వహించకుండా, బస్టాండ్ ఆవరణలో వాహనాలు నిలుపకుండా అడ్డుకున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో వాహనాలు లోనికి రాకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సాయన్న మాట్లాడుతూ.. బస్టాండ్ ఆవరణలో మేకల సంత నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీకి విన్నవించామన్నారు. సంత నిర్వహించకుండా ప్రతి శనివారం పర్యవేక్షిస్తామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్టీసీ అధికారులు తీసుకున్న చర్యలపై ప్రయాణికులు, విద్యార్థులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

11మందిపై హత్యా కేసు నమోదు

రెంజల్, డిసెంబర్ 14: మండలంలోని వీరన్నగుట్ట తండాకు చెందిన రెడ్యానాయక్ హత్యకు కారణమైన 11మందిపై కేసు నమోదు చేసినట్లు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న శనివారం తెలిపారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని తన భర్తను హత్య చేశారని మృతుడి భార్య రత్నావత్ లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో 11మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

మాక్లూర్, డిసెంబర్ 14: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ముల్లంగి(బీ) గ్రామ శివారులో శనివారం చోటుచేసుకున్నది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టుముక్కుల గ్రామానికి చెందిన తొర్లికొండ సురేశ్(37) దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. మెడికల్ రిపోర్టులో ఫెయిల్ కావడంతో మానసికంగా బాధపడుతూ, జీవితంపై విరక్తి చెంది ముల్లంగి(బీ) గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మనుశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

నందిపేట్ ఎస్సైగా చిరంజీవి

నందిపేట్, డిసెంబర్ 14: నందిపేట్ ఎస్సైగా చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. నందిపేట్‌లో పని చేసిన హరిబాబు నిజామాబాద్ వీఆర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో మెట్‌పల్లి ఎస్సైగా ఉన్న చిరంజీవి బదిలీపై వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

బస్టాండ్‌లో చోరీకి పాల్పడిన మహిళ అరెస్టు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 14: ఆర్మూర్ కొత్త బస్టాండ్‌లో చోరీకి పాల్పడిన మహిళను అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం తెలిపారు. అనిత ఆర్మూర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో డొంకేశ్వర్ గ్రామానికి చెందిన భూమ అనే మహిళ అనిత పర్సు, సెల్‌ఫోన్‌ను చోరీ చేసింది. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితురాలిని పట్టుకున్నారు. అనంతరం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు విచారణ చేపట్టినట్లు ఎస్హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బస్సులు ఎక్కేటప్పుడు ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

పీడీఎస్ బియ్యం సీజ్

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్14: డీసీఎంలో తరలిస్తున్న 21 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆర్మూర్ కొత్త బస్టాండ్ సమీపంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సతీశ్ శుక్రవారం పట్టుకున్నారు. విజిలెన్స్ డిప్యూటీ తహసీల్దార్ పంచనామా నిర్వహించి డీసీఎం డ్రైవర్ జాకీర్, అన్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ సత్యనారాయణ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై దాడికి ఖండన

మాక్లూర్, డిసెంబర్ 14: ఢిల్లీ మార్చ్ చేపట్టిన రైతులపై పోలీసులు దాడి చేయడాన్ని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయారెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

బాల్కొండ, డిసెంబర్ 14: పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధన కోసం ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు నిశాంత్ మహరాజ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అర్హులైన వారికి 200 గజాల స్థలంలో 4 గదుల ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేసినా.. ఎలాంటి స్పందన లేకపోవడంతో 16న నిరవధిక దీక్ష చేపట్టనున్నట్లు నిశాంత్ మహరాజ్ తెలిపారు. దీక్షకు బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.భోజన్న, మండల అధ్యక్షుడు క్రాంతి, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగన్న సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా నాయకులు మురళి, వినోద్, రంజిత్, సాయిరాం, శేఖర్, రాజు, రవి, పెంటన్న పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

బోధన్‌లో క్రిస్టియన్ శాంతి ర్యాలీ

బోధన్, డిసెంబర్ 14: బోధన్‌లో క్రిస్టియన్ శాంతి ర్యాలీని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సీఎస్ఐ చర్చి నుంచి బస్టాండ్ మీదుగా జూనియర్ కాలేజీ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతయ్య చౌదరి, పాస్టర్లు థామస్, జ్యోతిరాజు పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన ..

మాక్లూర్, డిసెంబర్ 14: మాక్లూర్ మండలంలోని కృష్ణానగర్, శాంతినగర్‌లో పండ్ల తోటలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఇక్కడి రైతులను ఇతర ప్రాంతాల వారు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.

NT-338978-All

PLOT FOR SALE

★డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.

NT-327118

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

GST వర్తించును

సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా వివరించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రాజీయే రాజమార్గం

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్14: రాజీ మార్గమే రాజమార్గమని ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా అన్నారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. కక్షలు పెంచుకోవడం ద్వారా సాధించేది ఏమీ ఉండదన్నారు. క్షణికావేశంలో ఎలాంటి తప్పులు చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా పలు కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, కోర్టు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో 3,600 కేసుల పరిష్కారం..

బోధన్, డిసెంబర్ 14: బోధన్‌లోని న్యాయస్థానాల ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,600 కేసులకు పరిష్కారం లభించింది. బోధన్ కోర్టులో ఏర్పాటుచేసిన నాలుగు బెంచీలకు సంబంధించి 149 కేసుల్లో మొత్తం కోటీ 30 లక్షల 54 వేల 510 రూపాయలు కక్షిదారులకు చెల్లించారు. స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు (సెకండ్ క్లాస్)కు సంబంధించిన 3,451 కేసులను పరిష్కరించారు. ఈ కేసులకు సంబంధించి జరిమానాల రూపంలో ప్రభుత్వానికి రూ.25 లక్షల 730 జమచేశారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు ఎస్.రవికుమార్, ఎం.పూజిత, సాయిశివ, న్యాయవాదులు మధుసింగ్, దేవన్ అజయ్‌కుమార్, మారుతీరావు కన్నా, సీహెచ్‌వీ హన్మంత్‌రావు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా, బోధన్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి

17న గ్రామ పంచాయతీ కార్మికుల 'చలో హైదరాబాద్'

నవీపేట, డిసెంబర్ 17: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరు